క్లుప్తంగా

పొంగులేటి శపథం నెరవేరింది

వైరా: ఖమ్మం జిల్లా నుంచి ఒక్క బీఆర్ఎస్ అభ్యర్థిని కూడా అసెంబ్లీ గేటు దాటనివ్వనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన శపథం నెరవేరింద ని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో చేరాయని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. ఆదివారం వైరాలో జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని, ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాలలో కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పనిచేసి గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కంటే అత్యధిక మెజార్టీ సాధించాలన్నారు.

హామీలు నెరవేర్చాలి

మధిర: ఎన్నికలకు ముందు ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు డిమాండ్ చేశారు. కార్మికులను కలుసుకుందాం, సమస్యలను తెలుసుకుందాం కార్యక్రమంలో భాగంగా ఆదివారం యూనియన్ రాష్ట్ర, రీజియన్ నాయకులు సందర్శించారు. డిపోలోని ఉద్యోగులను స్వయంగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులను స్వయంగా కలుసుకుని వారి సమస్యలను పరిశీలించి యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డిపోలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, జె పద్మావతి, రాంబాబు, సుధాకర్, గోపాలకృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్లూరు: వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆదివారం కల్లూరులోని చంద్రుపట్ల క్రాస్‌రోడ్డు వద్ద దాత మేకల సాంబశివరావు ఆధ్వర్యంలో మజ్జిగ ఏర్పాటు చేయగా నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పసుమర్తి చందర్‌రావు, ఏనుగు సత్యంబాబు, భాగం ప్రభాకర్‌రావు, పాపబత్తిని నగేష్, దారా రంగా, యాసా శ్రీకాంత్, నల్లగట్ల కిషోర్, తోట సుబ్బారావు, వెంకటేశ్వరరావు, గోపాలరావు, లాల్‌సింగ్ పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న గ్రామస్తులు

కారేపల్లి: మండల పరిధిలోని భాగ్యనగర్‌తండా డీబీ సెంటర్‌లో బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా.. బొడ్రాయి, ముత్యాలమ్మతల్లికి జలాభిషేకాలు చేసి, అనంతరం మహిళా భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమాలను నిర్వాహక కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కాషాయం జెండా ఎగరేస్తాం

తల్లాడ: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మంలో బీజేపీ విజయం సాధించి ఖిల్లాపై కాషాయం జెండా ఎగురవేస్తామని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లాడి తిరుపతిరెడ్డి అన్నారు. తల్లాడలో ఆదివారం బీజేపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో బీజేపీ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, జిల్లా కార్యదర్శి నాయుడు రామారావు, తల్లాడ మండల బీజేపీ అధ్యక్షులు వెంకటరామారావు, కార్యదర్శి కృష్ణారావు, రమేష్, శారద, సుధాకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కారేపల్లి: మండలంలోని పేరుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎండీ మౌలాలీ వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం వైరా క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే విధంగా ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బోడ రవి, పచ్చిపాల వెంకట్‌తో పాటు మరికొంతమంది పార్టీలో చేరారు.

ఆశీర్వాదం

ముదిగొండ: మండలపరిధిలోని చిరుమర్రికి చెందిన కాంగ్రెస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు పల్లపాటి కృష్ణ కుమారుడి వివాహం సందర్భంగా మధిర ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం నూతన వధూవరులను ఆశీర్వదించారు. డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, గిడ్డంగుల చైర్మన్ నాగేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి అంబేద్కర్

సామాజిక న్యాయం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం ఆయా గ్రామాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, అఖిలపక్ష నాయకులు అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయసాధనకు పునరంకితం కావాలని వక్తలు పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



వైరా: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, నాయకులు



సత్తుపల్లిటౌన్: అంబేద్కర్ విగ్రహం వద్ద సండ్ర వెంకటవీరయ్య, నాయకులు



వేంసూరు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి



సత్తుపల్లిరూరల్: అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కమాండెంట్ పి.వెంకటరాములు



ముదిగొండ: వల్లభిలో..



ఎర్రుపాలెంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కారేపల్లిలో..



చింతకాని: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు



వైరారూరల్: సిరిపురంలో..



తల్లాడ: అన్నారుగూడెంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్సై కొండల్‌రావు



బోనకల్: కలకోటలో..



ఏన్కూరులో..



కొణిజర్ల: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1991–92లో చదువుకున్న పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం జమలాపురం గ్రామంలోని రెడ్డి కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. జీవితంలో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నందిగం వెంకట్, నంద్రు వెంకటేశ్వరరావు, బుర్రా వెంకటనారాయణ, ముప్పల శ్రీను, మల్లికార్జునరావు, బాబు ఖాన్, షేక్ ఇమాంసా, హనుమంతరావు, నరసింహారావు, శ్రీనివాసరావు, నరేంద్ర ఉపేంద్ర, మురళి, నాగమల్లేశ్వరి, నాగేంద్రమ్మ, కృష్ణకుమారి, నాగవేణి, రహీమున్నీసా, సుకన్య, సుభద్ర, నాగరాణి, పార్వతి, గోపాలరావు, కృష్ణయ్య, ఖాదర్ జానీ, మోహన్ బాబు, తదితరులున్నారు.

వైరా: వైరాలోని విజ్ఞాన్ పాఠశాలలో ఆదివారం తల్లిదండ్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. పాఠశాలలో చదివి నవోదయలో సీటు సాధించిన పావని, వరుణ్‌తేజ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జయప్రకాశ్, ప్రిన్సిపాల్ దిలీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని శ్రీహరిహరాత్మజ అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం అయ్యప్పస్వామి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, స్వామికి పంచామృతాభిషేకాలు, పడిపూజ, విష్వా దర్శనం నిర్వహించారు. మహాపడిపూజ, అయ్యప్ప సంకీర్తనలతో భజనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డాక్టర్ మట్టా దయానంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన గడిపర్తి సత్యనారాయణ, రమేష్ సోదరులు ఆలయ అభివృద్ధికి రూ.1,11,118లను విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, దోసపాటి అమరలింగేశ్వరరావు, బొంతు శ్రీనివాస్, వందనపు సత్యనారాయణ, దురిశేటి శ్రీనివాస్, రావి నాగేశ్వరరావు, గుడిమెట్ల సోమేశ్వరరావు, పోలిశెట్టి శివకుమార్, రేపాక సత్యకుమర్ పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న సత్యనారాయణ, రమేష్ సోదరులు

శ్రీకృష్ణ మందిరానికి తలుపులు వితరణ



ఆలయానికి అమర్చిన తలుపుల వద్ద దాత వ్యాసభట్టు శ్రీవాణి

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జవహర్‌నగర్‌లో పునఃనిర్మితమైన శ్రీరుక్మిణిసత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయానికి జవహర్‌నగర్ కాలనీకి చెందిన వ్యాసభట్టు శ్రీవాణి రూ.1,16,000 విలువైన ఆలయ ముఖద్వార తలుపులను వితరణగా అందించారు. తన భర్త వ్యాసభట్టు రామ్‌కిరణ్ జ్ఞాపకార్థం ఈ తలుపులను ఆలయానికి చేయించినట్లు ఆమె తెలిపారు. భవిష్యత్‌లో ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

ఆర్థిక సాయం



బాధితులకు రూ.85వేలు అందిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పట్టణంలోని మహాత్మా గాంధీ రోడ్‌కు చెందిన చెన్నూరి సాంబశివరావు, రమాదేవి దంపతులు కొంతకాలంగా పక్షవాతానికి గురయ్యారు. వీరి పరిస్థితి దయనీయంగా ఉండటంతో.. చవ్వా మధు తన స్నేహితులతో కలిసి రూ.85 వేలు విరాళాలు సేకరించి బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాంబాబు, మధు, రామచంద్రరావు, శ్రీనివాసరావు, ప్రసాద్, వీరివాడ నాభూషణం పాల్గొన్నారు.

గన్నవరంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

వైరారూరల్: మండలంలోని గన్నవరం గ్రామంలో మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకను పురస్కరించుకొని తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 33 మంది పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత, కారుమంచి ప్రేమ్, కారుమంచి మనోజ్, మాగంటి సునీల్, పెయింటర్ ప్రభాకర్, అబ్రహం, శీలం నవ్య, శీలం కృష్ణారెడ్డి, వేమిరెడ్డి సురేందర్, షేక్.మస్తాన్, వెంకట రామాచారీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖద్దరు దుస్తులు ధరించాలి

మధిరరూరల్: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎండను తట్టుకునేందుకు ప్రతి ఒక్కరూ ఖద్దరు దుస్తులను వాడాలని ప్రముఖ సామాజిక సేవకుడు లంకా కొండయ్య తెలిపారు. మధిర పట్టణంలోని ఆజాద్ రోడ్‌లో ఉన్న ఆయన నివాసంలో సోమవారం పలువురు నిరుపేద వృద్ధులకు, వికలాంగులకు ఉచితంగా నూతన దుస్తులను అందించారు. సిరిపురం గ్రామానికి చెందిన పురోహితులు అవధానుల రామకృష్ణశాస్త్రి నుంచి సేకరించిన అదనపు నూతన దుస్తులను పలువురికి వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొద్ది సంవత్సరాలుగా రామకృష్ణశాస్త్రి తన ఇంట్లో అదనంగా ఉన్న నూతన దుస్తులను తాను నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ ఉచిత పాత దుస్తుల కేంద్రానికి వితరణగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఖద్దరు దుస్తుల వినియోగంపై అవగాహన కల్పించారు. అదే విధంగా మరికొంతమంది దాతల నుంచి స్వీకరించిన దుస్తులను పలువురికి పంపిణీ చేశారు.

జగన్‌పై దాడి పిరికి పందల చర్య

తల్లాడ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై దాడి పిరికి పందల చర్య అని అన్నారుగూడెం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ అభిమానులు పేర్కొన్నారు. శనివారం విజయవాడలో జగన్‌పై చేసిన దాడిని వారు తీవ్రంగా ఖండించారు. ఆంధ్రాలోనే కాదు తెలంగాణాలో కూడా జగన్‌కు అశేష అభిమానులున్నారని, ఇలాంటి చర్యలకు పూనుకుంటే తగిన గుణపాఠం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. దాడిని ఖండించిన వారిలో యాకూబ్‌పాషా, రామారావు, రమణ, ఆగస్టిన్, మరియన్న, ఉదయ్ ఉన్నారు.

ఆలయంలో మంత్రి పూజలు



కోదండరామస్వామి అభిషేక కార్యక్రమంలో మంత్రి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే రాగమయి, నాయకులు

కల్లూరురూరల్/కల్లూరు/మధిర(చింతకాని): మండలంలోని రాఘునాధగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామస్వామి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యజ్ఞశాలలో ఆదివారం నిర్వహించిన అభిషేక పూజ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాల్గొన్నారు. నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి దేవాలయంలో నేడు బొడ్రాయి(నాభిశిల) దేవత విగ్రహ, ధ్వజ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన గోపూజ, మూలమంత్ర, పీటదేవతా పూజ, కలాన్యాస హోమం, పుష్పార్చన, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కల్లూరు మండలం నారాయణపురం వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం ఉదయం కాసేపు సేద తీరారు. తన వ్యవసాయ క్షేత్రంలో కలియ తిరుగుతూ మామిడి పంటను పరిశీలించారు. సూర్య కాంతుల మధ్య పచ్చని పంట పొలాల్లో తిరుగుతూ ఉత్సాహంగా గడిపారు. అదే విధంగా చింతకాని మండలంలోని వందనం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నారపోగు వెంకటేశ్వర్లు(58) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందగా.. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్య మౌళిక సదుపాయాల కల్పన చైర్మన్ మువ్వా విజయ బాబు, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, పసుమర్తి చందర్‌రావు, మట్టూరి జనార్దన్, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కాటేపల్లి కిరణ్, సోమరాజు సీతారామారావు, ఏనుగు సత్యబాబు, ప్రభాకర్ చౌదరి, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొనగా.. మృతదేహాన్ని సందర్శించిన వారిలో ఎంపీపీ పూర్ణయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు వీరభద్రం, వెంకటేశ్వర్లు, భాస్కర్, గోవిందరావు, కిషోర్, సంజీవరెడ్డి, మనోహర్‌బాబు, సీతారామయ్య తదితరులు ఉన్నారు.

పంట రుణాలను రీ షెడ్యూల్ చేయాలని వినతి..

తల్లాడ: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల మూలంగా నాగార్జున సాగర్ ఆయకట్టు కింద ఉన్న భూముల్లో పంటలు పండలేదని.. పంట రుణాలను రీ షెడ్యూల్ చేసి రైతులను ఆదుకోవాలని ఆదివారం రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన రైతులు తూము వెంకటనారాయణ ఆధ్వర్యంలో పొంగులేటిని కల్లూరు మండలం నారాయణపురంలో కలుసుకొని విన్నవించుకున్నారు. పంటలు పండనందున రైతుల రుణాలు రీ షెడ్యూల్ చేసి టర్మ్ రుణాలుగా మార్చి ఏడాది పాటు మారిటోరియం కల్పించి అట్టి రుణాలను 7 సంవత్సరాల్లోపు చెల్లించే విధంగా అవకాశం కల్పించవల్సిందిగా రైతులు వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు తూము వెంకటనారాయణ, జి.వెంకటేశ్వర్లు, వి.వెంకటేశ్వర్లు, టి.జ్యోతి, వి.శ్రీనివాస్, జి.శ్రీనువాసరావు, గోపయ్య, ఎస్.వెంకటేశ్వర్లు,కె.క్రిష్ణ, జి.నర్సింహా, కృష్ణయ్య, రాములు, ముత్యాలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించండి

మధిర: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మండల పార్టీ అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయనతో పాటు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పాల్గొని మాట్లాడారు. మంచి మెజార్టీతో గెలిపిస్తే తెలంగాణ గొంతుకనై పార్లమెంట్‌లో జిల్లా వాణిని వినిపిస్తానని నామా పేర్కొన్నారు. కార్యకర్తలు బూత్ స్థాయిలో ప్రణాళికతో పనిచేసి మెజార్టీ సాధించాలన్నారు. బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం నామాను, ఎంపీ రవిచంద్రను వ్యాపార ప్రముఖులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, తాళ్లూరి జీవన్, మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత, పట్టణ పార్టీ అధ్యక్షులు కనుమూరి వెంకటేశ్వరరావు, మొండితోక జయాకర్, బిక్కి ప్రసాద్, అరిగే శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, శీలం విద్యాలత, వెంకటరెడ్డి, చిత్తారు నాగేశ్వరరావు, కూనా నరేంద్రరెడ్డి, చావా వేణు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ



వైరా: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏసీపీ రెహమాన్



మధిర: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, తదితరులు

వైరా/మధిర/సత్తుపల్లిటౌన్: వచ్చే వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైరా ఏసీపీ ఎంఏ రెహమాన్, ఎంఈఓ వై.ప్రభాకర్, సత్తుపల్లి ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ సూచించారు. అగ్ని మాపక వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం వారు వైరాలోని ఏసీపీ కార్యాలయంలో, మధిర పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో ఉన్న ఫైర్ స్టేషన్‌లో, సత్తుపల్లిలోని ఆర్టీసీ డిపోలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు కాల్ చేయాలన్నారు. వారోత్సవాల్లో భాగంగా పెట్రోలుబంక్‌లు, షాపింగ్ మాల్‌లు, పాఠశాలలు పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించాలన్నారు. జన సమూహ కూడళ్లలో అగ్ని ప్రమాదాల నివారణపై ఫైర్ సిబ్బందిచే ప్రమాదాలు ఏ విధంగా ఎదుర్కోవాలో తెలియజేసే విన్యాసాలను ప్రదర్శిస్తామని తెలిపారు. అమరులైన ఫైర్ ఉద్యోగులకు శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ మాధవరావు, ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్ బండారు రాంబాబు, వాలంటీర్లు చెడే సతీష్, సుగ్గల రామకృష్ణారావు, అగ్నిమాపక ఎల్ఎఫ్ ఎం.వెంకటేశ్వరరావు, ఎఫ్ఎం వై.వీరభద్రం, రాజేంద్ర, డీటీపీ వెంకటేశ్వరరావు, ఆర్టీసీ ఉద్యోగులు సుబ్బారావు, గద్దం శ్రీను, వెంకటయ్య, నారాయణ, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



గుత్తా వెంకటేశ్వరరావు చిత్రాపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి తుమ్మల

వేంసూరు: మండలంలోని లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు గుత్తా వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం నిర్వహించిన గుత్తా వెంకటేశ్వరరావు దశదిన కర్మలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి, మువ్వా విజయ్ బాబు, నియోజకవర్గం మండలానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరమర్శించారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

మధిర(చింతకాని): విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదువుతూ ఉన్నతంగా ఎదగాలని తహసీల్దార్ రమేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని నాగులవంచ గ్రామంలోని శ్రీ ఆదర్శ విద్యాలయంలో సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాల ప్రారంభించి 25 సంవత్సరాలను పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులను, పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను, బోధనేతర సిబ్బందిని పూలమాలలు, శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, విద్యావేత్త, విశ్రాంత సైనిక ఉద్యోగి అరుణ్‌కుమార్, ఆదర్శ విద్యాలయం వ్యవస్థాపకులు చావా అరుణ్‌కుమార్, కిరణ్, ఉపాధ్యాయులు రేణుక, వినీల, గోపీచంద్, సుజిత, త్రివేణి, పార్వతి, సుజాత, ఝాన్సీ, జ్యోతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కొణిజర్ల: కొణిజర్లలోని సమత సూపర్‌జెమ్స్ పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ మోదుగు శ్యాంసన్, ట్రస్మా రాష్ట్ర నాయకులు సంక్రాంతి రవికుమార్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ స్వర్ణ రవికుమార్, సొసైటీ వైస్ చైర్మన్ నెల్లూరి రమేష్ తదితరులు హాజరయ్యారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ కరస్పాడెంట్ ఉమాశంకర్‌రావు, డైరక్టర్లు భాగ్యలక్ష్మి, సిరితేజ, ఉపాధ్యాయులు, పెద్దలు పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగుల తయారీపై మహిళలకు శిక్షణ



శిక్షణ తీసుకుంటున్న మహిళలు

పెనుబల్లి: మండలంంలోని అడవిమల్లేలలో స్టేట్ బ్యాంక్ఆఫ్ ఇండియా రూరల్ ఎంప్లాయిమెంట్ ట్రెనింగ్ ఇన్స్టిట్యూట్ ఖమ్మం తరుణ్ హాట్ వరంగల్ ఆధ్వర్యంలో మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గత 13 రోజులుగా 35 మంది మహిళలు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరై జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. వీరికి సోమవారం ఖమ్మం తరుణి హాట్‌లో సర్టిఫికెట్లు అందజేయున్నట్లు, అలాగే ఎస్‌బీఐ ద్వారా స్వయం ఉపాధికింద రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.